క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున దేవరకొండ మండలంలోని ముదిగొండ రగామం నుండి కొండమల్లేపల్లి పట్టణానికి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను హైదరాబాద్ రోడ్డులో పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మినా కళాశాల విద్యార్థినులు

మిర్యాలగూడ : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అమానుషంగా హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల వద్ద డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గూడా నాగేంద్రప్రసాద్, పల్లా భిక్షం, వదూద్, నాగేశ్వర్‌రావు, సరిత, జ్యోతి, స్వరూప, క్రాంతి, సుజాత పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన ఎంఎస్‌పీ నేతలు


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న ఎంఎస్‌పీ మిర్యాలగూడ నేతలు

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధన కోసం మూడు దశాబ్దాలు పాలక ప్రభుత్వాలపై అలుపెరగని పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణను సాధించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ మహాజన సోషలిస్ట్ పార్టీ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛాలను అందించారు. మంద కృష్ణ మాదిగను కలిసిన వారిలో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు కందుకూరి శ్రీను మాదిగ, ఉమ్మడి జిల్లా సీనియర్ నేత మొలకపూరి రాంబాబు, ఇటుకల నాగరాజు తదితరులున్నారు.

శ్రీకృష్ణాష్టమి విశిష్టతపై ప్రచారం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

హుజూర్‌నగర్ : శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా హుజూర్‌నగర్ ఈనెల 31 నిర్వహించబోయే శ్రీకృష్ణ భగవాన్ ఊరేగింపును జయప్రదం చేయాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో శ్రీకృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం చేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కోదాడ, హుజూర్‌నగర్ కమిటీల అధ్యక్షుడు, సభ్యులు పోటు వెంకటేశ్వర్లు, ముత్తవరపు శైలజ, వంగాల మహేష్, ఉల్లి అరుణ, పాల్గొన్నారు.

కరాటేలో కట్టంగూరు వాసి ప్రతిభ

కట్టంగూరు : మండల కేంద్రానికి చెందిన కరాటే మాస్టర్ అంతటి సోములుగౌడ్ అంతర్జాతీయ జపాన్ బ్లాక్ బెల్ట్ మూడో డిగ్రీ సర్టిఫికెట్ పొందారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జపాన్ కరాటే అసోయేషన్ ఇండియా 16వ నేషనల్ మాస్టర్స్ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో అంతటి సోములుగౌడ్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. జపాన్ బ్లాక్ బెల్ట్ మూడో డిగ్రీ సర్టిఫికెట్, ఇన్‌స్ట్రక్టర్ లైసెన్సు, జపాన్ మెంబర్‌షిప్ కార్డులను జపాన్ మాస్టర్ షిహన్ టకుయా టనియామా చేతులమీదుగా అందుకున్నారు.

ముత్యాలమ్మ గుడికి విరాళం

నల్లగొండ: మున్సిపాలిటీ కేంద్రంలోని 39వ వార్డు గాంధీనగర్‌లో ముత్యాలమ్మ ఆలయానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా యువనేత పల్లా రవితేజ రూ.25,116 విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం

- రోజు రోజుకూ పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- నామమాత్రంగా బర్త్ కంట్రోల్ చర్యలు
- వాహనాల వెంటపడి పరుగుపెట్టిస్తున్న శునకాలు
- గాయాలపాలవుతున్న చిన్నారులు, వాహనదారులు


పెద్దదేవులపల్లిలో రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

త్రిపురారం : మండలంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కల సంతతి ప్రతి ఏటా పెరుగుతుంది. ఇదే క్రమంలో కుక్క కాటుకు గురవుతున్న బాధితుల సంఖ్య రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతుంది. గొర్రెలు, మేకల మందలు, ఆవులు, గేదెలు, లేగ దేడలపై కూడా విరుచుకుపడుతూ కరుస్తున్నాయని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో ప్రధాన సెంటర్ వద్ద, బాబుసాయిపేట రోడ్డులో బారత్ గ్యాస్ సమీపంలో, పెద్దదేవులపల్లిలో రెండో బస్టాండ్ వద్ద బైక్‌పై వెళ్తున్న వారి వెంట కుక్కలు పడడంతో బైక్‌లు కింద పడి గాయాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధి కుక్కల స్వైర విహారం చేస్తూ కరుస్తుండడంతో బాధితులు వ్యాక్సిన్ వేయించుకోవడానికి వస్తూనే ఉన్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ద్వారా తెలిసింది.

జంతు సంరక్షణ చట్టంతో ఇక్కట్లు

గ్రామాలు, తండాల్లో విపరీతంగా కుక్కల సంఖ్య పెరుగుతున్న తరుణంలో వాటిని నిర్మూలించడానికి జంతు సంరక్షణ చట్టంతో ఇక్కట్లు తలెత్తుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. కుక్కలను హతమార్చితే క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉండడంతో పంచాయతీ కార్యాలయ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని తెలుస్తుంది. అయితే కుక్కల గుంపులు చెదరగొట్టడం, వాటి సంఖ్యను పెరగకుండా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేపట్టడం వంటి చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విపరీతమైన ఆరోపణలు వినిపించడం గమనార్హం. ఇప్పటికైనా కుక్కల సంఖ్య పెరగకుండా ఉండడానికి కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయడానికి అధికారులు చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

మండల కేంద్రంలోని త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దదేవులపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క కాటుకు రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కరిసిన వెంటనే భయాందోళనకు గురికాకుండా గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. వెంటనే అందుబాటులో ఉన్న విధంగా టీటీ ఇంజెక్షన్ వేయించుకోవాలి. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిల్లో వైద్యుల సూచన మేరకు రేబీస్ టీకాను వేయించుకోవాలి. కుక్క కాటును నిర్లక్ష్యం చేయడం వల్ల రేబిస్ వ్యాధి మొదడుపై ప్రభావం చేపడం వల్ల మరణాలు సైతం సంభవిస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. పశువులను కుక్కలు కరిసిన వెంటనే వైద్యుల సూచనలు పాటించి పశువులకు చికిత్స చేయించవచ్చు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాలి



వీధుల్లో ఒంటరిగా వెళ్లాలంటే భయంగా ఉంది. కుక్కలు చప్పుడు కాకుండా వెనక నుంచి వచ్చి కరుస్తున్నాయి. గొర్రెల మందలపై దాడి చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి సంతతి పెరగకుండా అరికట్టాలి. అధికారులు పట్టించుకోకపోవడంతో దారుణాలు జరుగుతున్నాయి.

- చింతకాయల యాదయ్య, త్రిపురారం

139 కుక్కలు ఉన్నట్లు గుర్తించాం



మండల కేంద్రంలో 139 కుక్కలు ఉన్నట్లు గుర్తించాం. వీధుల్లో కుక్కలు గుంపులుగా ఉంటే చెదరగొట్టాలని పంచాయతీ సిబ్బందికి చెప్పాం. కుక్కలను చంపడం మా పరిధిలో లేదు. కలెక్టర్ ఆదేశానుసారం వచ్చే మూడు నెలల్లో జిల్లా కేంద్రంలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటిలో సాధుకునే కుక్కలు ఉంటే వెంటనే వైద్యుల సూచనల మేరకు యాంటీ రేబీస్ టీకాలు వేయించాలి.

- రాజేంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శి, త్రిపురారం

కుక్క కాటు ప్రమాదకరమైందే



కుక్క కాటు చాలా ప్రమాదకరమైంది. నెలకు దాదాపు 60మందికి పైగా కుక్క కాటు బాధితులు ఆస్పత్రికి వచ్చి వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. మండలంలో రెండు పీహెచ్‌సీల పరిధిలో కుక్క కాటు వాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కాటు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు వ్యాక్సిన్ తీసుకోవాలి. రేబిస్ వ్యాక్సిన్ తీసుకోకపోతే ఎలాంటి చికిత్స ఉండదు. వ్యాధి మొదడుపై ప్రభావం చూపడం వల్ల మరణాలు సంభవిస్తాయి.

- డాక్టర్ శంకర్ నాయక్, మండల వైద్యాధికారి, త్రిపురారం

సాగర్‌లో సత్యసాయి నివాస్ ప్రారంభం


మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, లింగారెడ్డిలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాగార్జునసాగర్ : పైలాన్‌కాలనీలో శ్రీసత్యసాయి బాబా మందిరం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సత్యసాయి నివాస్‌ను సాయిబాబా ఆలయం వ్యవస్థాపకులు ఎస్‌వీ ఎస్ఎస్ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓంకార సుప్రభాతం, మహానగర సాయినామ సంకీర్తన నిర్వహించారు. తదనంతరం శత లింగార్చన, అభిషేకం, చండీహోమం స్వామివారికి మంగళహారతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డిలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎస్ఈ రఘురాం, ఆలయ అర్చకులు పోచంబొట్ల శంకర్‌శర్మ, సతీష్, సాయికృష్ణ అరుణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పాన్‌షాపు దగ్ధం


మంటలను ఆర్పుతున్న స్థానికులు

మిర్యాలగూడ అర్బన్: షార్ట్ సర్క్యూట్‌తో పాన్‌షాపు దగ్ధమైంది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఆదివారం జరిగింది. డాక్టర్స్ కాలనీలో కొండేటి శ్రీనివాస్ అనే వ్యక్తి పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం కావడంతో ఉదయం తీయలేదు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పాన్‌షాపులో నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో స్థానికులు గమనించి శ్రీనివాస్‌కు, ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. శ్రీనివాస్ వెంటనే షాపు వద్దకు వచ్చి మంటలను చూసి బోరున విలపించాడు. ఫైర్ సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకోకపోవడంతో మంటలు పక్క షాపునకు వ్యాపిస్తాయని భావించిన స్థానికులు బకెట్ల సహాయంతో నీటిని చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తనకు పాన్‌షాపు ఒక్కటే ఆధారమని, అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

అబ్రహం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేడి అబ్రహం మృతి పార్టీకి తీరని లోటని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, పీఏసీఎస్ మండల చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సయ్యద్ నిజాం అన్నారు. ఆదివారం మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో అబ్రహం మృతదేహం వద్ద వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీలు కూరాకుల చెన్నయ్య, సామేలు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చయ్య, నరసింహారావు, వెంకటనారాయణ, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం


కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నాట్కో ట్రస్ట్ సభ్యులు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ నేత్ర విజ్ఞాన సంస్థ ఎల్వీ ప్రసాద్ సాంకేతిక సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలకుర్తి, పర్వేదుల పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు. 189 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు, కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించి త్వరలో శస్త్రచికిత్సలు చేస్తామని, అద్దాలను అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మలపల్లి లలితవెంకట్‌రెడ్డి, నాట్కో ట్రస్ట్ సిబ్బంది డాక్టర్ మురళీధర్, ప్రతినిధి జీఎల్ఎన్ రావు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి కో–ఆర్డినేటర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు


ఇందిరమ్మ కాలనీలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు


కలాల్ వాడలో..

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మకు పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన భక్తులు అమ్మవారి బోనాలు సమర్పించారు. మహిళలు తెల్లవారు ఝాము నుంచే మంగళ స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించి తరలివచ్చారు. అలాగే గాంధీనగర్‌లో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం సత్తేమ్మ, ముత్యాలమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌కు చెందిన ఉబ్బపల్లి నంద–సరోజన దంపతులు ఆధ్వర్యంలో భక్తులకు లడ్డూలను పంపిణీ చేశారు. శ్రావణ మాసంలో భాగంగా ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలోని ముత్యాలమ్మ అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్న గౌడ్


కొండమల్లేపల్లిలో.. నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


చింతపల్లి : కురుమేడులో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

చింతపల్లి : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు అనంతుల వెంకటయ్య గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కురుమేడ్ ఎక్స్‌రోడ్డు వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్కొండను ఏలిన మొదటి విప్లవ వీరుడు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంతుల పెద్ద జంగయ్యగౌడ్, అనంతుల మల్లేష్ గౌడ్, జెల్లా నరసింహగౌడ్, యాదయ్యగౌడ్, రవిగౌడ్, యాదయ్య గౌడ్ మాజీ వార్డ్ సభ్యులు, శేఖర్ గౌడ్, రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

దేవరకొండ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని తెలంగాణ గౌడ గీత సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, విజయ్‌గౌడ్, రేణుగౌడ్, సైదులు గౌడ్, లాలయ్యగౌడ్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.


దేవరకొండ : సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, తదితరులు


గుర్రంపోడులో..

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రంలో మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గడ్, శివగౌడ్, శంకర్‌గౌడ్, మారయ్య గౌడ్, మారయ్య, రమేష్ పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలకేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు ఐతగోని వెంకటేశం, గ్రామశాఖ అధ్యక్షుడు రావుల సైదులు గౌడ్, నాయకులు వడ్డగోని గంగాధర్‌గౌడ్, వెంకటనారాయణ, సైదులు, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు సన్మానం


ఉత్తమ పోలీస్ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న కాకతీయ కమ్మ సంఘం నాయకులు

నేరేడుచర్ల : ఉత్తమ పోలీస్ అవార్డులు అందుకున్న నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు, సోమవరం గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణలను ఆదివారం నేరేడుచర్లలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. చౌటుప్పల్ ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు ఇండియన్ పోలీస్ మెడల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం, గంటా సత్యనారాయణ సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్‌గా సేవలు అందిస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం గ్రామానికే గర్వకారణమన్నారు. సుంకరి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రావులపల్లి ప్రసాద్, కౌన్సిలర్లు సులోచనశ్రీనివాస్, వేమురి నాగవేణినారాయణ, న్యాయవాది సుంకరి ప్రదీప్తి, నెమ్మగడ్డ సుబ్బారావు, తిరుపతయ్య, పున్నయ్య, పాతూరు శ్రీనివాస్‌రావు, రోశయ్య, మాదవరావు, వెంకటేశ్వర్‌రావు, చిట్టిబాబు, శ్రీను, కృష్ణవేణి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ మరమ్మతులకు రూ.4.40 లక్షలు మంజూరు

నడిగూడెం : మండలంలోని సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న కొమరబండ మేజరు కాల్వ మరమ్మతులకు నీటి పారుదల శాఖ నుంచి రూ.4.40 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మేజర్ కాల్వలో పలు చోట్ల పూడిక తీయించాలని, కంపచెట్లను తొలగించాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మరమ్మతులు పూర్తయితే రామాపురం, ఎఖ్లాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి, రత్నవరం, వాయిలసింగారం గ్రామాల రైతుల పంట భూములకు నీరందుతుందన్నారు.

మంచంపట్టిన కృష్ణపట్టె


ఉల్సాయిపాలెంలో రోడ్లపై పారుతున్న మురుగు


అడవిదేవులపల్లిలో వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న బాలుడు

- విషజ్వరాలతో బాధపడుతున్న ప్రజలు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు

అడవిదేవులపల్లి : మండలంలోని కృష్ణపట్టె గ్రామాల ప్రజలు విష జ్వరాలతో తల్లడిల్లిపోతున్నారు. కొన్ని రోజులుగా ప్రజలు అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, కొత్త నందికొండ, జిలకరకుంటతండ, హాంతండ, ముదిమాణిక్యం, బాల్నేపల్లితో పాటు పలు గ్రామాల్లో వందల సంఖ్యలో జ్వరపీడితులు ఉన్నారు. ప్రతి ఏటా కృష్ణపట్టే గ్రామాల్లో డెంగీ, మలేరియా, టైఫాడ్, చికున్ గున్య వంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వీటిని అరికట్టడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. మండలంలోని వందలాది మంది ప్రజలు విష జ్వరాలతో ఇబ్బందులు పడుతూ వేలాది రూపాయలు ఖర్చుబెట్టి మిర్యాలగూడ, మాచర్ల, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలను నిర్వహించుకుంటున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగు కాల్వలు పూడికతీత చేపట్టకపోవడంతో పాటు కొత్త డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి నిలుస్తున్నారు. దీంతో ఆ మురుగులో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో వర్షాలు పడినప్పుడల్లా నీరు నిలిచిపోయి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఒక వైపు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో మరో వైపు ప్రత్యేక అధికారులు పాలన కావడంతో గ్రామాలను పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు ఎవరు కూడా స్థానికంగా ఉండకపోవడంతో గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నారు.

మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి



మండలంలోని గ్రామాల్లో విషజ్వరాలు అధికంగా ఉన్నందున మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలి. జ్వరపీడితులను గుర్తించి వైద్యం అందించాలి. రక్త నమూనాలను సేకరించి విష జ్వరాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సాయం సైదయ్య, అడవిదేవులపల్లి

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి



గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. చెత్తా, చెదారంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దోమలతో విష జ్వరాలు సోకుతున్నాయి. దోమల నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. మెరుగుల్లో పాగింగ్ చేయాలి. సురక్షితమైన నీటిని అందించాలి.

- రత్నాకర్‌రెడ్డి, ఉల్సాయిపాలెం.

కూలీలకు భలే డిమాండ్

- ముమ్మరంగా సాగుతున్న పత్తిలో కలుపుతీత, వరి నాట్ల పనులు
- చేతి నిండా పనితో కూలీలు ఫుల్ బిజీ


పత్తిచేనులో కలుపు తీస్తున్న కూలీలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వ్యవసాయ పనులు ఒక్కసారిగా ఊపందుకోవడంతో కూలీలకు భలే డిమాండ్ పెరిగింది. గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడటంతో దొరకడం కష్టంగా మారింది. ప్రస్తుతం పత్తి పంటలో కలుపుతీత పనులు ప్రారంభం కాగా, ఇటీవల నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సాగు నీటిని విడుదల చేయడంతో వరి నాట్లు కూడా ప్రారంభయ్యాయి. వరి నాట్లు, కలుపుతీత పనులతో పాటు మిర్చి పంటను కూడా నాటు పెడుతుండటంతో రైతులకు కూలీలు దొరకడం లేదు. మండలంలో వరి నాట్లు ఇంకా ప్రారంభం కాకపోవడంతో ఇతర ప్రాంతాలకు ఆటోల ద్వారా వెళ్తున్నారు. మహిళా కూలీలు నాటుకు గుత్తా లెక్కన వెళితే రోజుకు రూ.800 వందల నుంచి రూ. వెయ్యి వరకు సంపాధిస్తున్నారు. అదే పనికి కూలీగా వెళితే రూ.500 ఇస్తున్నారు. దీనికి ఆటో చార్జి అదనం. దీంతో కూలీలు ఎక్కువగా వరి నాట్లకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అక్కడ కూడా కూలీల కొరత ఉండటంతో ఎంత ఇవ్వడానికైనా సిద్ధపడి ఇక్కడి నుంచి కూలీలను తీసుకెళ్తున్నారు. మండలంలో కూడా వరి నాట్లు ప్రారంభం అయితే కూలీల కొరత ఇంకా తీవ్రతరం కానుంది. పత్తిలో కలుపుతీత పనులకు, మిర్చి నాటుకు రూ. 300 నుంచి రూ. 350 వరకు మాత్రమే ఇస్తుండటంతో ఈ పనులకు కూలీలు దొరకడం లేదు. సాగు నీరు రావడం, ఆశించిన మేర మెట్ట పంటలు కూడా సాగులో ఉండటంతో ఈ ఏడాది మొత్తం కూలీలకు చేతినిండా పని దొరకనుంది.

ప్రశాంతంగా పద్మశాలి సంఘం ఎన్నికలు

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బూర మల్లేశం, వల్లకాటి రాజ్‌కుమార్ పోటీ పడుతున్నారు. కాగా జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం నాయకులు ఆదివారం ఎస్‌పీటీ మార్కెట్‌లోని పోపా కార్యాలయంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చేనేత పవర్‌లూమ్ కార్మికులు కూడా ఓట్లు వేశారు. ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా పున్న రవీందర్, పోలింగ్ ఆఫీసర్‌గా జెల్ల పుల్లయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో పున్న కుమారస్వామి, దుడుకు లక్ష్మీనారాయణ, రాజేందర్, రాంప్రసాద్, మత్స్యగిరి, శ్రీనివాస్, ప్రకాశ్, విశ్వం పాల్గొన్నారు.


ఓట్లు వేస్తున్న పద్మశాలీలు